# నమ్మలేని వెరైటీ

— వియోగి

"ఏమండోయ్! గోపాలంగారూ! ఈ రోజు ఆఫీసుకి సెలవన్నారుగా ఎక్కడికి బయలు దేరుతున్నారు?"

షూస్ వేసుకుంటున్న గోపాలం భార్యామణి మదనిక ప్రశ్నకు చిర్రెత్తుకొచ్చింది. తనెక్కడికి వెళితే ఈమెకెందుకు? ఆ మాత్రం స్వాతంత్ర్యం తనకు లేదా?

"మద్దీ! ఎక్కడికెళ్ళాలన్నా నీ పర్మిషన్ కావాలా?"

"పర్మిషన్ కాకపోయినా తమరెక్కడికి వెళ్తున్నారో తెలిస్తే మంచిది కదా!" తనని కంట్రోలు చేసుకుంటూ చెప్పింది.

"ఎందుకో? వ్యంగ్యంగా అన్నాడు.

"మీకోసం ఆ గ్యాంగ్ దిగబడొచ్చు పేకాట ఆడుకునేందుకు— వాళ్ళకి చెప్పాలిగా మీరెక్కడికి తగలడ్డారో?"

"మా గ్యాంగ్ ఇవ్వాళరారు— సరేనా— ఇంకెందుకు?"

"అయితే మీరెక్కడికి వెళ్ళేది నాతో చెప్పాల్సిన అవసరం లేదంటారా?"

"అంతే! నేను ఇంట్లో లేనప్పుడు పక్కింటి ప్రమీలతో పొద్దున పోయి సాయంత్రానికి వస్తుంటావు. నేనెప్పుడైనా అరాలు తీశానా? ఏ పిక్చరుకు పోయావో... ఏ గుడికి వెళ్లావో?" లాపాయింట్ తీశాడు.

"ఎందుకంటే నేనే మీకు చెవిలో ఇల్లు కట్టుకుని చెబుతుంటాగా. అందుకుని అడగరు. ఎలాగూ రాత్రికి తెలుస్తుంది కాబట్టి" జడల్లుకుంటూ చెప్పింది.

"అది కాదు— నీ మీద నాకున్న నమ్మకం అలాంటిది. అలాగే నా మీద కూడా నీకు నమ్మకం ఉండాలి. ఎక్కడకు పోతున్నా అడకక్కాడదు—" అలా అడిగి మూడు పాడ్ చేయకూడదు" విసుగు అణుచుకుంటూ గోపాలం చెప్పాడు.

"మహానుభావా! గోపాలా! ఇంకెప్పుడైనా అడిగితే చెప్పుచ్చుకు కొట్టండి— ఏదో సెలవు రోజుకదా— ఇంట్లో ఉండి ఉద్ధరిస్తారని ఆశపడ్డాను" కళ్ళ నీళ్ళు ఒత్తుకుంటూ అంది.

గోపాలం మెత్తపడ్డాడు.

"అదికాదు మద్దీ!— నీకసలే చీరెల మోజు — నగల మోజు జాస్తీ కదా! ఆఫీసులో ఓటి చేస్తే నాలుగు డబ్బులొస్తాయి. మొగాడన్న తర్వాత సంపాదన గురించి ఆలోచించాలిగానీ — సాదస్తమానం పెళ్ళాం ఎదుట గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటే డబ్బులెలా వస్తాయి" అనునయంగా అన్నాడు.

"అబ్బో! మహాకొన్నారు లెండి నగలు— చీరెలు. నేను చేసే ఎంబ్రాయిడరీ— కుట్టుపన్లు— ట్యూషన్లతోనే డబ్బు సంపాదించి కొనుక్కున్నాను— చిల్లర ఖర్చులకు మీ మీద ఎప్పుడు ఆధారపడ్డాను?" కోపంగా అంది మదనిక.

"కరెక్ట్! సిటీలలో ఉంటే ఎంత సంపాదించినా చాలి చావదు— ఏదో వేణ్ణీళ్ళకు చన్నీళ్ళు లాగా భార్యకూడా సంపాదిస్తే అందం. ఎలాగనా భోజనం అయిందిగా సాయంత్రానికల్లా వస్తాను" బ్రీఫ్ కేస్ తీసుకుని చెప్పాడు.

"రాత్రికి రాకపోయినా నాకేం నష్టం లేదు — పెళ్ళాం మోజు తీరగానే ఇంక ఇల్లు గుర్తు రాదుగా" సాధించింది.

"డోంట్ బీసిల్లీ డార్లింగ్! నువ్వు నా ప్రణయ దేవతవు. పరాయి పిల్లని కన్నెత్తి చూడను. నీకు తెలుసుగా నా సంగతి— అసలే శ్రీరామచంద్రుడ్ని...!"

"అందుకే కాదా! చిన్న చిన్న తగాదాలొస్తున్నా సర్దుకుపోతున్నాను. అయినా ఆ మాటకొస్తే నేను సీతమ్మని."

"వైనాట్! కాని ఎందుకు చెప్పలేదంటే— మన దేశంలో ఆడదాని ప్రాతివ్రత్యాన్ని గుర్తించినట్టు— మొగవాళ్ళ ప్రాతివ్రత్యాన్ని గుర్తించడం లేదు. అందుకని గొంతు చించుకుని అరుస్తున్నాను—" కాలరు సర్దుకున్నాడు.

"మహాప్రభో! రేపు జరిగే మహిళా మండలి వార్షికోత్సవాలలో మీకు 'భర్తశ్రీ' బిరుదు ఇప్పిస్తాను— ఇంక ఆపి దయచేయండి. బయటకు నెట్టి తలుపేసింది మదనిక.

● ● ● ● ● ● ● ●

ఆఫీసుకు వచ్చిన గోపాలం జీవకారిపోయాడు. ముందు చెప్పినట్లు తన పర్సనల్ సెక్రటేరీ రాజీ రాలేదు. నిన్నటి సంఘటన గుర్తుకు వచ్చింది.

తను లెటర్ డిక్టేట్ చేస్తూ రాసుకుంటున్న ఆమెను మింగేటట్లు చూస్తున్నాడు— ఎందుకో తలెత్తిన రాజీ— అతని చూపు చూసి పైట సరి చేసుకుంది— కోప్పడుతుందనుకున్నాడు కానీ— చిరునవ్వు నవ్వింది. దానితో ధైర్యం వచ్చి కుర్చీలోంచి లేచి ఆమె భుజం మీదుగా చెయ్యి వేశాడు.

"ప్లీజ్! రేపు వస్తాను. మీ కోసం" రాజీ అంది.

"రేపు సెలవుగా—"

"అందుకే హ్యాపీగా గడిపేద్దాం— రేపు ఆఫీసుందని ఇంట్లో చెప్పి వస్తాను— మీ కోసం" రాజీ అంది— "పిక్నిక్‌కు వెళదాం" రాజీ అర మోడ్పు కళ్ళతో చెప్పింది.

"వెరీగుడ్! నీలాంటి సిన్సియర్ వర్కర్లంటే నాకు ఎంతో ఇష్టం! నీకు వంద రూపాయలు ఇంక్రిమెంట్ శాంక్షన్ చేస్తున్నాను ఈ నెల నుంచి."

"థాంక్యూ!" అతని పెదవుల మీద ముద్దు పెట్టింది.

రాజీ మాట చెప్పినట్లు వస్తుందని తను ఇంట్లో ఇన్ని అబద్ధాలాడి వచ్చాడు.

అసలు తను తరచు సెక్రటరీలను మారుస్తూ ఉండేది ఇలాంటి కొత్త అనుభవాల కోసమే!

నెలకి ఒకసారన్నా తను బయట ఎంగిలి పడేది కేవలం లైఫ్‌లో వెరైటీ కోసమే!

అయినా లైఫ్‌లో థ్రిల్లు సాధించాలంటే ఇంట్లోనే ఎప్పుడూ ఉండకూడదు.

కొత్త కొత్త రుచులు చవి చూస్తూ— అభిరుచులు పెంచుకోవాలి. అసలు తన క్రింద పని చేసే మన్మథరావుని చూసి తను ఇంకా చాలా నేర్చుకోవాలి. జీవితాన్ని ఎంత హాయిగా — మరుగ్గా ఏ మాత్రం చెరపు లేకుండా అనుభవిస్తాడు.

గోపాలంకు మన్మథరావు ఓ రోజు చెప్పిన సంఘటన గుర్తుకు వచ్చింది.

"గురుగారూ! మన సిటీ కూడా డెవలప్ అవుతోంది. సందేహం లేదు" మంచి ఊపుతో వచ్చి చెప్పాడు.

"ఏమిటోయ్! మంచి ఉషారులో వున్నావు? ఏంటికథ? గోపాలంకు రానే వచ్చింది

అనుమానం— మధ్యాన్నం పిట్లో లేవు?'' ఆఫీసుకు పని మీద బయటకెళ్లావా?''

''అబ్బబ్బ! చెప్పలేనండి— వాటె వండర్ ఫుల్ కంపెనీ!'' మురిసిపోతున్నాడు మన్మథరావు.



''కంపెనీనా?— మన కంపెనీ వదిలేసి కొత్త కంపెనీలో జాయినవుతున్నావా?'' అదుర్దాగా అడిగాడు.

అబ్బే! అది కాదు సార్— అది ఆ కంపెనీ.. ఆ కంపెనీ. ఈ ఊళ్లో అమెరికన్ మోడల్లో ఓ కంపెనీ పెట్టారు లెండి... జస్ట్ మనం ఫోన్ చేస్తే చాలు— అన్నీ వాళ్ళే అరేంజ్ చేస్తారు... అంతా హ్యాపీగా ఉంటుంది.''

''ఏదో ఘనకార్యం చేసి వచ్చినట్లున్నావు.'

''చెప్పలేనండీ— పేరు రాధికట. అబ్బ! ఎంత మజా ఇచ్చింది. అటువంటి ఆడదాన్ని నా లైఫ్‌లో చూడలేదంటే నమ్మండి— ఎంతో మంది దగ్గరకెళ్ళాను— కానీ రాధికను మాత్రమూ మరచిపోలేను...!''

''ఏం కొత్త పిట్టా!... బావుందా...!'' ఉత్సాహంగా అడిగాడు.

''ఫ్యామిలీ లేడీట! పాపం! అంత బ్యూటిఫుల్ లేడీకి నపుంసకుడు భర్తట! ప్చ్! దేవుడు చాలా అన్యాయం చేశాడు! అందుకోసమే... అప్పుడప్పుడు ఇలా వస్తుందిట'' అంటూ ఆమె అందాల్ని వర్ణించి చెప్పాడు. ఆమెతో తన అనుభవాల్ని లొట్ట వేసుకుంటూ

ఎందుకైనా మంచిదని గోపాలం ఆ కంపెనీ ఫోన్ నెంబర్ తీసుకున్నాడు.

ఇప్పుడు అది పని కొచ్చింది. డైరీ తీసి ఆ నెంబర్‌కు ఫోన్ చేశాడు. అవతల ఫోన్ ఎత్తగానే తన పేరు మార్చి తనకి రాధిక కావాలని చెప్పాడు. వాళ్ళు ఫలానా హోటల్‌లో ఫలానా నెంబర్ గదిలో వెయిట్ చెయ్యండి... అరగంటలో పంపిస్తామని చెప్పారు.

ఓ అరగంటలో గోపాలం వాళ్ళు చెప్పిన గదిలో ఉన్నాడు. అతని మనసు ఉవ్విళ్ళూరుతున్నది... ఈ రోజు స్వర్గంలో గడపాలి... దీని మొహం చూసి చూసి మొహం మొత్తింది.

ఛ! ఛ! లైఫ్‌లో ఇలాంటి థ్రిల్ లేకపోతే సెక్స్ మీద ఆసక్తి పోతుంది.

రాజీ రాకపోయినా రాజీ పడని మన్మథరావు లాగా ఆనందాన్ని అనుభవించబోతున్నాడు.

తలుపుల మీద టకటక చప్పుడయింది. ''యస్ కమిన్'' చెప్పాడు. తలుపు తెరుచుకుంది.

మోడ్రన్ డ్రస్సుల్లో ఓ దేవత మెరుపు తీగెలాగా ప్రత్యక్షమయింది. అతనికి రాధికను గుర్తు పట్టడానికి కొన్ని క్షణాలు పట్టింది.

ఆమె మదనిక! ఆమె కూడా నిశ్చేష్టురాలైంది.